క్లుప్తంగా

నేడు వార్షిక బడ్జెట్ ప్రత్యేక కౌన్సిల్ సమావేశం

నందిగామ: నగర పంచాయతీ వార్షిక బడ్జెట్ ప్రత్యేక కౌన్సిల్ సమావేశం సోమవారం నిర్వహిస్తామని కమిషనర్ డాక్టర్ జయరాం ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. చైర్ పర్సన్ మండల వరలక్ష్మి అధ్యక్షతన ఉదయం 11 గంటలకు ఈ సమావేశం ప్రారంభమవుతుందన్నారు. వార్షిక బడ్జెట్ కు సంబంధించిన అంశాలపై చర్చించి ఆమోదిస్తామని పేర్కొన్నారు.

కల్యాణోత్సవానికి విస్తృత బందోబస్తు

పెనుగంచిప్రోలు: శ్రీతిరుపతమ్మ కల్యాణ మహోత్సవం విజయవంతంగా నిర్వహించడానికి విస్తృత పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు నందిగామ డీఎస్పీ నాగేశ్వరరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం ఆయన జగ్గయ్యపేట సీఐ నాగమురళి, ఎస్ఐ హరిప్రసాద్‌తో కలిసి కల్యాణ వేదిక స్థలం పరిశీలించి ఆలయ సిబ్బందికి, పనులు నిర్వహిస్తున్న వారికి పలు సూచనలు చేశారు. భక్తులకు ఇబ్బంది లేకుండా విధుల నిర్వహణపై, బందోబస్తు వివరాలను ఎస్ఐకు తెలియజేశారు. కార్యక్రమంలో ఆలయ ఏఈఓ ఉమాపతి, ఏఈ రాజు, తదితరులు పాల్గొన్నారు.

కోడిపందేల శిబిరంపై పోలీసుల దాడులు

బూదవాడ(జగ్గయ్యపేట): కోడిపందేల శిబిరంపై పోలీసులు దాడులు చేసిన సంఘటన ఆదివారం గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామంలోని అటవీ ప్రాంతంలో కోడి పందేలు నిర్వహిస్తున్నట్లు చిల్లకల్లు ఎస్సై కె.దుర్గాప్రసాద్‌కు సమాచారం అందడంతో సిబ్బందితో వెళ్లి దాడి చేశారు. దాడిలో ఐదుగురు వ్యక్తులు 10 ద్విచక్ర వాహనాలు, రూ.5,200 నగదుతో పాటు రెండు పుంజులను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

శృతి మనోహరం లయ విన్యాసం



వాగ్గేయకార కీర్తనలు గానం చేస్తున్న శ్రీదేవి

విజయవాడ కల్చరల్: త్రిపుర కల్చరల్ ఆర్ట్స్, తిరుమల తిరుపతి దేవస్థానం, అన్నమయ్య పరివారం ఆధ్వర్యంలో భీష్మ ఏకాదశి సందర్భంగా ఆదివారం సత్యనారాయణపురం సీతారామా కల్యాణమండపంలో నిర్వహిస్తున్న నాద సంగమం కార్యక్రమాలు భక్తిరస ప్రదానంగా సాగాయి. భక్తిరంజని కార్యక్రమంలో పురాణపండ శాలిని, దర్భాకుల బాల త్రిపుర సుందరి, కేంద్రీయ విద్యాలయం విద్యార్థులు, ఎస్పీ శ్రీదేవి, వాగ్గేయకార కీర్తనలను ఆలపించారు. హరికథ భాగవతార్ పాలం రామాంజనేయులు భక్త మార్కండేయ, కట్టాజేజి నారాయణ దానవీరశూరకర్ణ కథను గానం చేశారు. చింతారవి బాలకృష్ణ బృందం కూచిపూడి నృత్యాలను ప్రదర్శించారు. చివరిగా చిన్నారి దర్భాకుల విశ్వనాథ్(5 సంవత్సరాలు) మృదంగ లయ విన్యాసం ప్రత్యేక ఆకర్షణగా నిలచింది.

ఉచిత వైద్యశిబిరాలు వినియోగించుకోండి

గంఢ్రాయి(జగ్గయ్యపేట): గ్రామీణ ప్రాంతాల్లో ఉచిత వైద్యశిబిరాలను నిర్వాహకులు విస్తృతం చేయాలని సర్పంచ్ కొత్తపల్లి లూర్దుమేరి పేర్కొన్నారు. గ్రామ సచివాలయంలో ఆల్‌మైటీ నర్సింగ్‌హోమ్ (భవానీపురం) బూచవరం ప్రభుత్వాసుపత్రి సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్యశిబిరాన్ని ఆదివారం ఆమె ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ వైద్యశిబిరాలను రోగులు వినియోగించుకోవాలన్నారు. ప్రభుత్వం ప్రభుత్వాస్పత్రుల అభివృద్ధికి కృషి చేస్తోందన్నారు. నంతరం కంటివైద్యులు కోలా విజయశేఖర్ 200ల మందినిరీక్షించగా 56మందిని శుక్లాల ఆపరేషన్ చేయాలన్నారు. కార్యక్రమంలో ఎండీవో జయచంద్ర, బూచవరం వైద్యాధికారిణి స్రవంతి, కార్యదర్శి రమాదేవి, గ్రామపార్టీ నాయకులు నరసాని రాంబాబు, యలమంద వావు, రమేష్, వైద్యులు రంజిత్, వినోద్, సురేష్, అనీల్‌కుమార్, యమున, తదితరులు పాల్గొన్నారు.

వృద్ధుడి అదృశ్యంపై ఫిర్యాదు



పల్లి రాజు

రైల్వేస్టేషన్(విజయవాడ పశ్చిమ): వృద్ధుడు అదృశ్యంపై విజయవాడ జీఆర్పీ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. కాకినాడలోని జగన్నాథపురానికి చెందిన గుడివాడ హరిలక్ష్మి కుటుంబ సభ్యులతో కలసి ఈ నెల 20వ తేదీన తిరుపతి వెళ్లి రైలులో తిరిగి వస్తున్నారు. ఈ క్రమంలో రైలు విజయవాడ స్టేషన్ దాటిన తరువాత చుసుకోగా బెర్త్‌లో ఉండాల్సిన ఆమె తండ్రి పల్లి రాజు(72) కనిపించలేదు. దీంతో వారు రైల్లోని అన్ని కోచ్‌లలో వెతికినా కనిపించలేదు. వారు తమ ప్రయాణాన్ని కొనసాగించి తమ బంధువులు, తెలిసిన వారి ఇంటికి వెళ్లి వెతికినా ఆచూకీ లభ్యం కాలేదు. తమ తండ్రి విజయవాడ స్టేషన్‌లోనే దిగి వెళ్లి ఉంటాడనే అనుమానంతో ఆదివారం విజయవాడ జీఆర్పీ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఎస్సై బి.సాంబశివరావు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. ఆచూకీ తెలిసిన వారు 94405 95398 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

మహిమాన్వితుడు రామలింగేశ్వర స్వామి

- కోరిన కోర్కెలు తీర్చే దైవం
- రేపటి నుంచి తిరునాళ్ల మహోత్సవాలు
- పది రోజుల పాటు నిర్వహణ



నందిగామ పట్టణంలోని రామలింగేశ్వర స్వామి ఆలయం

నందిగామ: రాష్ట్రంలో ప్రసిద్ధి గాంచిన శివాలయాల్లో నందిగామ పట్టణంలో గల శుక శ్యామలాంబ సమేత రామలింగేవ్వర స్వామి ఆలయం (శివాలయం) ఒకటి. కోరిన కోర్కెలు తీర్చే స్వామిగా రామలింగేశ్వర స్వామి వాసికెక్కారు. ఆలయంలో గర్భ గుడికి అభిముఖంగా ఉన్న నంది విగ్రహం సాక్షాత్తు కై లాసంలో పరమ శివుని ఎదుట కూర్చున్న భావన కలిగిస్తుంది. ఈ నంది వల్లే నందిగ్రామము అనే పేరు వచ్చిందని, వాడుకలో అది కాస్తా నందిగామగా మారిందని చరిత్ర చెబుతోంది. 1797లో రాజా వాసిరెడ్డి వెంకటాద్రి నాయుడు ఈ ఆలయాన్ని పునర్నిర్మించారు. పూర్తిగా రాతితోనే ఆలయ నిర్మాణం జరిగింది. 50 సెంట్ల సువిశాల స్థలంలో ఆలయం ఏర్పాటైంది. వీరభద్ర స్వామి, సుబ్రహ్మణ్య స్వామి వార్ల అంతరాలయాలతోపాటు ఆలయానికి నాలుగు మూలల ఉప శివాలయాలున్నాయి.

మాఘ మాసంలో స్వామి వారి తిరునాళ్ల ....

ఏటా మాఘ మాసంలో తిరునాళ్ల మహోత్సవాలు జరుగుతాయి. దీనికితోడు ప్రతి సోమవారం తోపాటు ప్రత్యేక పర్వ దినాల్లో స్వామి వారికి విశేష పూజలు నిర్వహిస్తారు. ఏటా కేవలం పది సార్లు మాత్రమే గర్భ గుడిలోకి సూర్య కిరణాలు ప్రకాశిస్తాయి. అధికంగా మాఘ మాసంలోనే ఎక్కువ పర్యాయాలు సూర్య కిరణాలు గర్భ గుడిలోని శివ లింగాన్ని తాకడం స్వామి వారి మహిమకు తార్కాణంగా భక్తులు చెబుతుంటారు. అరుదుగా దర్శనమిచ్చే ఈ అద్భుతాన్ని కనులార వీక్షించేందుకు భక్తులు పెద్ద ఎత్తున తరలి వస్తుంటారు.



రామలింగేశ్వర స్వామి

విశేష పూజలు, అభిషేకాలు....

స్థానిక మెయిన్ రోడ్డు లో ఉన్న రామలింగేశ్వర స్వామి వారి కల్యాణ మహోత్సవాలు మంగళవారం నుంచి ఘనంగా ప్రారంభం కానున్నాయి. పది రోజులపాటు జరిగే ఉత్సవాల్లో భాగంగా స్వామివారికి నిత్యం విశేష పూజలు, అభిషేకాలు నిర్వహిస్తారు. ఫిబ్రవరి మూడవ తేదీ రాత్రి సుఖ శ్యామలాంబా సమేత రామలింగేశ్వర స్వామి వారి కల్యాణం జరగనుంది. అనంతరం నాలుగో తేదీ సాయంత్రం స్వామివారి రథోత్సవం చేస్తారు. ఈ ఉత్సవాన్ని తిలకించేందుకు అనేక ప్రాంతాల నుంచి ఏటా భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వస్తూ ఉంటారు. ఇప్పటికే ఉత్సవాలు ఘనంగా నిర్వహించేందుకు ఆర్డీవో రవీంద్రరావు ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహించారు.

విద్యార్థులకు ఆరోగ్యకరమైన మెనూ



నిర్వాహకులు తయారుచేసిన వంటకాలను పరిశీలిస్తున్న ఎంఈఓ

నందిగామ: ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు మెరుగైన, పౌష్టిక ఆహారం అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం మెనూ ఏర్పాటు చేసిందని ఎంఈఓ బి.బాలాజీ తెలిపారు. పట్టణంలోని జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల ఆవరణలో ఆదివారం వంట ఏజెన్సీల నిర్వాహకులకు మెనూ ప్రకారం విద్యార్థులకు అందించే ఆహార పదార్థాల తయారీపై పోటీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎంఈఓ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు ప్రతినిత్యం అందిస్తున్న మెనూలోని వంటకాల తయారీపై పోటీ నిర్వహించామని తెలిపారు. ఈ పోటీ ద్వారా వంట ఏజెన్సీల నిర్వాహకులు మెరుగైన ఆహారం తయారు చేసే విధానంపై మరింత అవగాహన కలుగుతుందని చెప్పారు. పోటీలో పాల్గొన్న ప్రతి ఒక్కరూ వంటలు చక్కగా చేశారని తెలిపారు. ముఖ్యంగా ప్రభుత్వం విద్యార్థుల కోసం ఆరోగ్యకరమైన సన్నబియ్యాన్ని అందించడంతోపాటు పౌష్టికాహారాన్ని అందజేసే విధంగా చర్యలు తీసుకుంటుందన్నారు. విద్యార్థుల ఆరోగ్యమే లక్ష్యంగా వంట ఏజెన్సీలు పనిచేయాలని సూచించారు. పోటీలో ప్రతిభ కనబరిచిన వారికి ప్రోత్సాహక బహుమతులు అందిస్తామని పేర్కొన్నారు. జిల్లా పరిషత్ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

చుట్టూ అరుగు నిర్మించాలి



మురుగు నీటి పక్కన పూజలు చేసే చెట్టు

పెనుగంచిప్రోలు: తిరుపతమ్మ పెద్ద తిరునాళ్లలో భాగంగా జలబిందెల కార్యక్రమంలో మునేరు ఒడ్డున ఉన్న వేప చెట్ల వద్ద రజకులు బలిపూజ చేయటం ఆచారంగా వస్తోంది. ఆ చెట్టు చుట్టూ అపరిశుభ్ర వాతావరణం నెలకొంది. పక్కనే మురుగు పారుతుండటంతో పాటు పందులు సంచరిస్తున్నాయి. ఉత్సవ సమయంలో ఎంతో పవిత్రంగా అక్కడ పూజలు జరుగుతాయి. ఆ ఒక్క రోజు ఆలయ అధికారులు అక్కడ బ్లీచింగ్ చల్లిస్తున్నారు. వచ్చే నెల 5న జలబిందెల మహోత్సవం జరగనుంది. వేప చెట్టు చుట్టూ అరుగు కట్టటంతో పాటు, డ్రైనేజీ పక్కాగా నిర్మించాలని భక్తులు కోరుతున్నారు. దీనిపై ఆలయ అధికారులను వివరణ కోరగా స్థలాన్ని పరిశీలించి, అందరితో చర్చించి అవసరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

మహా కుంభాభిషేక మహోత్సవాలు ప్రారంభం



కార్యక్రమంలో భాగంగా నిర్వహిస్తున్న హోమాలు



వేద పండితుల ఆశీర్వచనం తీసుకుంటున్న ఎమ్మెల్యే

నందిగామ: పట్టణంలోని మరిడి మహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో మహా కుంభాభిషేక మహోత్సవాలు ఆదివారం సాయంత్రం ఘనంగా ప్రారంభమయ్యాయి. మూడు రోజులపాటు నిర్వహించే కార్యక్రమాల్లో భాగంగా మొదటి రోజు అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. సాయంత్రం సమయంలో లోక శాంతిని కాంక్షిస్తూ ఆలయ ప్రాంగణంలో పలు రకాల హోమాలు చేశారు. ప్రారంభ పూజా కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్ మోహన్‌రావు పాల్గొన్నారు. అనంతరం నిర్వాహకులు ఎమ్మెల్యేను సత్కరించారు.

నేత్ర పర్వంగా సాగిన కూచిపూడి నృత్యాలు



విజయవాడ కల్చరల్: దృశ్యవేదిక ఆధ్వర్యంలో నెల వారీ కార్యక్రమంలో భాగంగా గాంధీనగర్ హనుమంతరాయ గ్రంథాలయంలో ఆదివారం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు నేత్ర పర్వంగా సాగాయి. నాట్యాచార్యుడు ఎ.సంతోష్ బృందం భరతనాట్య సంప్రదాయంలో పలు అంశాలను ప్రదర్శించారు. భరతనాట్య సంప్రదాయంలో కీలకమైన నటరాజ స్వామికి పుష్పాంజలితో ప్రారంభించి, జతి స్వరం, ఆదిశంకరులను స్తుతిస్తూ శంకర-శాంకరి, చివరిగా మహాకాళి నృత్యాన్ని ప్రదర్శించారు. చైత్ర, రీతీష, జ్యోత్స్న, చిద్రుబి, ఐశ్వర్య, లిఖిత, ప్రవల్లిక, సాన్విశ్రీ, సాహితీ అనుపమ, అమృత వర్షిణి, హర్షిణి నృత్య కార్యక్రమంలో పాల్గొన్నారు. వాస్తవ సంఘటనలకు అద్దంపట్టిన సాంఘిక నాటకం పారిజాతం నాటికను ప్రదర్శించారు. మూల కథ జగన్నాథశర్మ, నాటకీరణ, కస్తూరి రాజశేఖర్ దర్శకత్వం ద్వాదశి చంద్రశేఖర్. ముఖ్య అతిథిగా పాల్గొన్న నాగార్జునా కళాపరిషత్ అధ్యక్షుడు దేవినేని కిషోర్‌కుమార్ మాట్లాడుతూ తెలుగు నాటక రంగానికి పూర్వవైభవం తీసుకురావాల్సిన అవసరముందన్నారు. నిర్వాహకులను అభినందించారు. సంస్థ నిర్వాహకుడు హెచ్‌వీఆర్ఎస్ ప్రసాద్, నాట్యాచారిణి పద్మశ్రీ హేమంత్, పిండిప్రోలు సూర్యనారాయణ మూర్తి, భాస్కర శర్మ పాల్గొన్నారు.

వ్యక్తి అనుమానాస్పద మృతి

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): వ్యక్తి అనుమానస్పదస్థితిలో మృతి చెందిన ఘటనపై భవానీపురం పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసుల కథనం మేరకు గొల్లపూడి ఎస్ఎస్ఎస్ కాలనీకి చెందిన తంగెళ్లమూడి అయ్యప్పరాజు మొదటి భార్యకు నలుగురు సంతానం. వీరిలో మూడో వాడైన తంగెళ్లమూడి రాజేష్(38) తొమ్మిదేళ్ల క్రితం కులాంతర వివాహం చేసుకుని విజయవాడలో నివాసం ఉంటున్నాడు. ఏ ఉద్యోగం చేయకుండా ఖాళీగా ఉంటున్నాడు. 10 రోజుల క్రితమే సూరాయపాలేనికి కాపురం మార్చాడు. శనివారం రాత్రి 6.30 గంటల సమయంలో ఇంటిలో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ విషయం హైదరాబాద్‌లో నివాసం ఉంటున్న అతడి సోదరుడు జయదేవ్ శనివారం రాత్రి 10.30 గంటల సమయంలో తండ్రికి ఫోన్ చేసి సమాచారం అందించాడు. తన కుమారుడు ఉరివేసుకుని చనిపోయాడని సమాచారం తెలుసుకున్న రాజేష్ తండ్రి అయ్యప్పరాజు భవానీపురం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. తన కుమారుడుకి సంతానం లేరని, లోన్ యాప్స్‌లో ఫైనాన్స్ తీసుకున్నాడని తనకు తెలిసిందని ఫిర్యాదులో పేర్కొన్నాడు. అసలు ఫైనాన్స్ ఎందుకు తీసుకోవాల్సి వచ్చిందో తనకు తెలియదని పేర్కొన్నాడు. ఒక వ్యక్తికి జూన్, జూలైలో ఫైనాన్స్ కిస్తి కట్టకపోతే బైక్ ఇచ్చేశాడని, అతను పటమట పోలీసుస్టేషన్‌లో కేసు పెట్టిన విషయం తనకు తెలిసిందని ఫిర్యాదులో తెలిపాడు. తన కుమారుడు ఉరేసుకుని చనిపోవడానికి లోన్ యాప్‌లు కారణమా? లేక భార్యభర్తల మధ్య విభేదాలు కారణమో తనకు పూర్తి వివరాలు తెలియదని పేర్కొన్నాడు. మృతుడి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. రాజేష్ మృతికి కారణాలపై అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నట్లు భవానీపురం సీఐ ఉమర్ తెలిపారు.

వేటూరి పాట తెలుగు సినిమా వెలుగు బాట

ఎమ్మెల్యే మల్లాది విష్ణు



వెంకటరామారావుకు వేటూరి సాహితీ పురస్కారాన్ని ప్రదానం చేస్తున్న విష్ణు తదితరులు

విజయవాడ కల్చరల్: వేటూరి పాట తెలుగు సినిమాకు వెలుగు బాట అని సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు పేర్కొన్నారు. వేటూరి సాహితీ పీఠం ఆధ్వర్యంలో గాంధీనగర్ కౌతా పూర్ణానందం కళావేదికలో ఆదివారం వేటూరి 87వ జయంతి వేడుకలు, సాహితీ ప్రముఖుడు బుద్ధాల వెంకట రామారావుకు వేటూరి పురస్కార కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వేటూరి కవిగా, పండితుడిగా, జర్నలిస్ట్‌గా, ముఖ్యంగా తెలుగు సినిమా పాటల రచయితగా సుస్థిరమైన స్థానం సంపాదించుకున్నారన్నారు. తెలుగు పాటకు జాతీయ స్థాయి గుర్తింపు తెచ్చిన వేటూరి తెలుగు సినిమా పాట ఉన్నంతకాలం ప్రేక్షకుల హృదయంలో నిలిచిపోతారన్నారు. వేటూరి సాహితీపీఠం వ్యవస్థాపకుడు నిడుమోలు రమాసత్యనారాయణ మాట్లాడుతూ ఓ సీత కథ ద్వారా సినీ రంగ ప్రవేశం చేసిన ఆయన సంప్రదాయ కవిత్వం నుంచి జానపద గీతాల వరకు తన ప్రతిభను చాటుకున్నట్లు తెలిపారు. రాలిపోయే పూవా నీకు రాగాలెందుకే గీతానికి జాతీయ స్థాయిలో ఉత్తమ గీతంగా బహుమతులు అందుకున్నట్లు తెలిపారు. ఆయన చివరి చిత్రం బద్రీనాథ్ అని గుర్తుచేశారు. సావిత్రి కళాపీఠం వ్యవస్థాపకురాలు పరచూరి విజయలక్ష్మి మాట్లాడుతూ వేటూరు రాసిన పాటలు చిత్ర విజయానికి దోహద పడ్డాయన్నారు. బ్రాహ్మణ సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కే బలరామకృష్ణ మూర్తి వేటూరి సాహితీ సేవలను వివరించారు. సాహితీవేత్త వెంకట రామారావుకు వేటూరి సాహితీ పురస్కారాన్ని ప్రదానం చేశారు. నగరానికి చెందిన పలువురు గాయకులు వేటూరి రచించిన గీతాలను ఆలపించారు.

విద్యార్థులు నైపుణ్యాలు పెంపొందించుకోవాలి

మధురానగర్(విజయవాడసెంట్రల్): విద్యార్థులు ఎప్పటికప్పుడు మారుతున్న కాలానుగుణంగా నైపుణ్యాలు పెంపొందించుకోవాలని అప్పుడే నిర్దేశించుకున్న లక్ష్యాలు చేరుకోగలరని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ ఎం.అజంతకుమార్ అన్నారు. స్థానిక మాచవరం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ ప్రాంతీయ కార్యాలయంలో ఆదివారం విద్యార్థులకు సాఫ్ట్‌స్కిల్స్, పరీక్షల ప్రిపరేషన్‌పై అవగాహన కార్యక్రమం జరిగింది. ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు.

అథ్లెటిక్స్‌లో ప్రతిభ చూపిన విద్యార్థినికి అభినందన



విద్యార్థిని దీక్షిత సాయిని అభినందిస్తున్న ప్రభుత్వ విప్ ఉదయభాను

జగ్గయ్యపేట అర్బన్: అథ్లెటిక్స్ చాంపియన్స్ 2023లో ప్రతిభ కనపరచిన విద్యార్థిని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను అభినందించారు. పట్టణానికి చెందిన రామ్‌కో సిమెంట్స్ ఉద్యోగి బండి రామాంజనేయులు కుమార్తె బండి దీక్షిత సాయి ఈనెల 23న శ్రీకాకుళంలో జరిగిన 66వ ఏపీ ఇంటర్ డిస్ట్రిక్ట్ స్టేట్ అథ్లెటిక్స్ చాంపియన్స్ 2023లో హర్డిల్స్ 80 మీటర్లలో మూడో స్థానాన్ని కైవసం చేసుకుంది. ఈ సందర్భంగా ఆదివారం ఎమ్మెల్యే ఉదయభాను నివాసంలో జరిగిన అభినందన కార్యక్రమంలో విద్యార్థి బండి దీక్షిత సాయిని ఉదయభాను అభినందించారు. మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, పార్టీ పట్టణ అధ్యక్షుడు ఆకుల శ్రీకాంత్, నాయకులు ఫిరోజ్‌ఖాన్, నంబూరి రవి, సర్పంచ్ యడ్లపల్లి సూరిబాబు, విద్యార్థి తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

కార్యాలయం ఏర్పాటు అభినందనీయం

ప్రభుత్వ విప్ ఉదయభాను



మెడికల్ షాపుల యూనియన్ కార్యాలయం ప్రారంభోత్సవంలో ప్రభుత్వ విప్ ఉదయభాను

జగ్గయ్యపేట అర్బన్: పట్టణంలో ఉన్న 60 మెడికల్ షాపుల నిర్వాహకులు ఉమ్మడిగా ఒక కార్యాలయాన్ని ఏర్పాటుచేసుకోవడం అభినందనీయమని, వారంతా మూడు నెలలకు ఒక సారి క్యాంపులు నిర్వహించి పేదలకు ఉచితంగా మందులు అందజేస్తూ సేవా దృక్పథంతో ఉండాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను అన్నారు. ఆదివారం పట్టణంలోని ఆర్టీసీ డిపో సెంటర్‌లో సామినేని విశ్వనాథం కార్మికనగర్‌లో జగ్గయ్యపేట కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ ఏర్పాటుచేసుకున్న కార్యాలయాన్ని ఉదయభాను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి నెలా ఒకటో తేదీన సమావేశాలు ఏర్పాటు చేసుకోవడానికి ఈ కార్యాలయం ఎంతగానో ఉపయోగపడుతుందని చెప్పారు. వివిధ కార్మిక సంఘాలు కార్యాలయాలు లేక ఇబ్బందులు పడుతుండగా భవన నిర్మాణ కార్మికులు, పెయింటర్స్ వర్కర్స్ యూనియన్, ప్రైవేటు ఎలక్ట్రికల్ వర్కర్స్ యూనియన్, ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్, ప్రెస్‌క్లబ్, టైలర్స్ అసోసియేషన్, ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్, పళ్ల వ్యాపారుల వర్కర్స్ యూనియన్, కార్పెంటర్స్ యూనియన్ తదితర దాదాపు 11 సంఘాల వారికి ఇదే కార్మికనగర్‌లో స్థలాలను కేటాయించి సొంత భవనాలను ఏర్పాటు చేసుకోవడానికి అవకాశం కల్పించామన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కార్మికుల కోసం అనేక మంచి కార్యక్రమాలు చేపట్టారన్నారు. మెడికల్ షాపుల యాజమాన్యాలు నాణ్యమైన మందులను ప్రజలకు సరఫరా చేయాలని సూచించారు. అనంతరం ఆయన్ను యూనియన్ సభ్యులు సన్మానించారు. కార్యక్రమంలో కేడీసీసీ బ్యాంక్ చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు, మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్, పార్టీ పట్టణ అధ్యక్షుడు ఆకుల శ్రీకాంత్(బాజీ), కౌన్సిలర్లు వట్టెం మనోహర్, ఖాదర్‌బాబు, పార్టీ నాయకులు ఫిరోజ్‌ఖాన్, కాశీ కిషోర్, ఎస్ఎస్‌పీ సైదా, మెడికల్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు కీసర రాంబాబు, పందిటి కోటేశ్వరరావు, కమిటీ సభ్యులు కిషన్‌రావు, అజీజ్, స్వామి గురు శ్రీను తదితరులు పాల్గొన్నారు.

తిరుపతమ్మ సన్నిధిలో భక్తుల సందడి



తిరుపతమ్మ దర్శనానికి క్యూలో భక్తులు

పెనుగంచిప్రోలు: గ్రామంలోని శ్రీతిరుపతమ్మ దర్శనానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. సెలవు దినం, పలు శుభకార్యాలు ఉండటంతో పెద్ద సంఖ్యలో భక్తులు తరలి వచ్చారు. దీంతో ఆలయ పరిసరాలు కిక్కిరిశాయి. భక్తులు అమ్మవారికి పాలు, పొంగళ్లతో దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. రెండు తెలుగు రాష్ట్రాల నుంచి వేల సంఖ్యలో భక్తులు తరలి రావటంతో గ్రామంలో ట్రాఫిక్ సమస్యలు ఎదురుకాకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఘనంగా చండీహోమం



హోమం చేస్తున్న వేద పండితులు

పెనుగంచిప్రోలు: గ్రామంలోని శ్రీతిరుపతమ్మ ఆలయంలోని యాగశాలలో ఆదివారం చండీహోమం వైభవంగా నిర్వహించారు. ఆలయ పండితులు వేద మంత్రోచ్చరణలతో హోమం చేసి పూర్ణాహుతి నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ లీలాకుమార్, చైర్మన్ ఇంజం చెన్నకేశవరావు, పాలకవర్గ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

మద్యం తాగి వాహనాలు నడిపితే చర్యలు



వాహనాల యజమానులతో మాట్లాడుతున్న సీఐ నాగేంద్రకుమార్

వీరులపాడు(కంచికచర్ల): మద్యం తాగి వాహనాలు నడిపితే చర్యలు తప్పవని నందిగామ రూరల్ సీఐ ఐవీ నాగేంద్రకుమార్ హెచ్చరించారు. పట్టణ పరిధిలోని పలు గ్రామాల్లో ఆదివారం డ్రంకెన్ డ్రైవ్ నిర్వహించారు. మద్యం తాగి వాహనాలు నడుపుతున్న పలువురు వ్యక్తుల పై పోలీసులు కేసులు నమోదు చేశారు. ఈ సందర్భంగా సీఐ నాగేంద్రకుమార్ మాట్లాడుతూ వాహన యజమానులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, వాహనానికి సంబంధించిన అన్ని రికార్డులను అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. రోడ్డు నియమ నిబంధనలు ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించాలని చెప్పారు. ఎస్ఐ సుబ్రహ్మణ్యం, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

నేడు స్పందన కార్యక్రమం

నందిగామ: స్పందన కార్యక్రమం ద్వారా సమస్యలను అర్జీల రూపంలో అందజేయాలని ఆర్డీఓ రవీంద్రరావు ఆదివారం ఓ ప్రకటనలో సూచించారు. ప్రతి సోమవారం నిర్వహించే స్పందన కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. డివిజన్ పరిధిలోని సమస్యలను అర్జీల రూపంలో ఆర్డీఓ కార్యాలయంలో అందజేయవచ్చన్నారు.

వీరులపాడు(కంచికచర్ల): కార్యాలయంలో సోమవారం ఉదయం 10 గంటల నుంచి ప్రజా సమస్యలపై స్పందన నిర్వహిస్తామని తహసీల్దారు వి.రాజకుమారి ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు తమ సమస్యలకు సంబంధించిన అర్జీలను అధికారులకు అందచేస్తే, ప్రాధాన్యత క్రమంలో వాటిని పరిష్కరిస్తామని పేర్కొన్నారు.

జాగ్రత్తలతోనే ప్రమాదాల నివారణ



వాహన చోదకులకు అవగాహన కల్పిస్తున్న ఏసీపి

నందిగామ: వాహన చోదకులు చిన్న చిన్న జాగ్రత్తలు పాటించడం వల్ల ప్రమాదాలు నివారించవచ్చని ఏసీపీ నాగేశ్వర్ రెడ్డి తెలిపారు. ఎస్ హెచ్ ఓ సతీష్ ఆధ్వర్యంలో ఆదివారం నందిగామ పట్టణంలో రోడ్డు ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించడంతోపాటు పట్టణంలో ప్రత్యేక ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలు నివారించాలంటే తప్పనిసరిగా ప్రతి ఒక్కరూ తగు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ముఖ్యంగా మద్యం తాగి, సెల్ ఫోన్ మాట్లాడుతూ, అతివేగంగా వాహనాలు నడపడం వలన ఎంతోమంది ప్రమాదాల బారిన పడుతున్నారని చెప్పారు. రోడ్డు ప్రమాదాల నివారించాలంటే ప్రతి ఒక్కరూ వాహనాలు నడిపేటప్పుడు బాధ్యతగా వ్యవహరించాలని పేర్కొన్నారు. ముఖ్యంగా వాహనం నడిపేటప్పుడు హెల్మెట్ ధరించడం తప్పనిసరన్నారు. మైనర్లకు వాహనాలు ఇస్తే సంబంధిత వాహన యజమాని పై చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఎస్ఐలు సురేష్, పండు దొర, సిబ్బంది పాల్గొన్నారు.

అలరించిన కూచిపూడి నృత్య ప్రదర్శన



నృత్య ప్రదర్శనలో కళాకారులు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ధర్మపథం కార్యక్రమంలో భాగంగా ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో ఆదివారం పలువురు నిర్వహించిన కూచిపూడి నృత్య ప్రదర్శన విశేషంగా ఆకట్టుకుంది. విజయవాడ యనమలకుదురుకు చెందిన హనుమాన్ నృత్య కళా నిలయానికి చెందిన శ్రీనాగ, షణ్ముఖప్రియ, ఇతిహ్య, తేజశ్విని కూచిపూడి నృత్య ప్రదర్శన ఇచ్చారు. కళావేదికపై నృత్య ప్రదర్శన ఇవ్వగా భక్తులు ఆసక్తిగా వీక్షించారు.